సాక్షి
పెద్దపల్లి
సోమవారం, 24, జూలై, 2023



ఎల్లంపల్లికి తగ్గిన వరద

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గింది. ఇన్‌ఫ్లో 27,401క్యూసెక్కులు ఉండగా.. నాలుగు గేట్లు ఎత్తి 20,390 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ఓదెల: ఓదెల మల్లన్నస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నుంచి తరలివచ్చారు.

గరిష్టం/కనిష్టం
30.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. మరికొన్ని చోట్ల చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

గోదావరి ఉధృతి పరిశీలన



వరద ఉధృతిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ దంపతులు

మంథని: మంథని వద్ద గల గోదావరి వరద ఉధృతిని ఆదివారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉన్నారని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వరద ఉధృతి క్రమంగా తగ్గుముఖం ``పట్టిందని తెలిపారు. గతేడాది ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురై అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో మరోమారు అలాంటి పరిస్థితులు రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కాంప్లెక్స్‌ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, మున్సిపల్‌కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ శ్రేణులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జీవీ శ్యాంప్రసాద్ లాల్



బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లా అదనపు కలెక్టర్‌గా జీవీ.శ్యాంప్రసాద్ లాల్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా పనిచేసిన ఆయనను బదిలీపై ఇక్కడ ప్రభుత్వం నియమించింది. గతంలో శ్యాంప్రసాద్‌లాల్ పెద్దపల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు.

ఎల్లంపల్లిని సందర్శించిన ఈఎన్‌సీ



వరద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు

రామగుండం: ఎగువన కురిసిన వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. వరద ఆదివారం కాస్త తగ్గుముఖం పట్టింది. ఈ క్రమంలో ప్రాజెక్టులో వరద నీటి పరిస్థితి, తదితర సాంకేతిక అంశాలను చర్చించేందుకు నీటి పారుదలశాఖ అధికారుల బృందంతో ఇంజినీర్ ఇన్ చీఫ్ నల్ల వెంకటేశ్వర్లు ప్రాజెక్టును సందర్శించారు. ఆయన వెంట ఈఈ బండ విష్ణుప్రసాద్, డిప్యూటీ ఈఎన్‌సీ దస్తగిరి, ఇంజినీర్లు కీర్తి, సిగ్ధ తదితరులున్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

పెద్దపల్లిరూరల్: అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాకేంద్రంలో ఇళ్ల కేటాయింపునకు లబ్ధిదారులను ఎంపిక చేసి.. ఇప్పటివరకు ఇళ్లు అప్పగించకపోవడమేంటని ప్రశ్నించారు. అర్హులందరికీ రేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కటకం మత్యుంజయం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ హాజరవుతారన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిలారాపు పర్వతాలు, నాయకులు ఉన్నారు.

ఆర్టీసీ డిపోకు కలగని మోక్షం



పెద్దపల్లి బస్టాండ్

- కలగానే జిల్లాకేంద్రంలో బస్ డిపో..
- నెరవేరని ప్రజల చిరకాల వాంఛ
- పలు పల్లెలకు చేరని బస్సు సర్వీసులు

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గకేంద్రం.. అన్నిటికీ మించి జిల్లాకేంద్రం. అయినప్పటికీ ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటుకు మాత్రం నోచుకోవడం లేదు. చాలా ఏళ్లుగా బస్‌డిపో ఏర్పాటును ఈ ప్రాంత ప్రజానీకం కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. గత అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఈ ప్రాంత ప్రజల డిమాండ్‌ను ప్రభుత్వం ముందుంచారు. జిల్లాల పునర్విభజన సమయంలో బస్ స్టాండ్‌ను బస్‌డిపోగా అప్‌గ్రేడ్ చేస్తామంటూ హడావుడి చేసిన అధికారులు ఆ తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదు.

స్థలం లేదన్న కారణంతో మంథనికి..

పెద్దపల్లిలో బస్‌డిపో ఏర్పాటుకు అప్పటి ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి ఎంతో ప్రయత్నించారు. ఆనాటి ప్రభుత్వం బస్‌డిపో మంజూరు చేసినా.. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు అనువైన స్థలం చూపలేకపోయారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐదెకరాల స్థలం కేటాయించేలా ముకుందరెడ్డి చేసిన యత్నాలు ఫలించలేదు. అప్పటికే జాప్యం జరగడంతో పెద్దపల్లికి మంజూరైన బస్‌డిపోను అప్పటి మంథని ఎమ్మెల్యే శ్రీపాదరావు మంథని తరలించుకుపోయారు. ఆ తర్వాత ఇక్కడి ఎమ్మెల్యేలు ఎంతగా యత్నించినా బస్‌డిపో ఏర్పాటుకు అడుగులు ముందుకు పడడంలేదు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు, రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ ఆర్టీసీ చైర్మన్లుగా వ్యవహరించినా ప్రభుత్వ నిర్ణయాల మేరకు కొత్తబస్‌డిపోల ఏర్పాటుకు చర్యలు తీసుకోలేకపోయారు.

ఆటో రిక్షాల్లోనే ప్రయాణం

జిల్లాలో ప్రసిద్ధ లక్ష్మినర్సింహస్వామి ఆలయమున్న దేవునిపల్లికి వెళ్లాలంటే ఆటోలే దిక్కు. పైగా పరిసర గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చేందుకు.. బస్సు, రైళ్లలో ప్రయాణించేందుకు సొంత వాహనాలు.. లేక ఆటోలు.. ఇతర ప్రైవేట్ వాహనాల్లో రావాల్సిందే. పెద్దపల్లి–ధర్మారం, పెద్దపల్లి–కూనారం మినహా మరే ఇతర మార్గాల్లో బస్సులు నడవవు. పల్లెలకు పక్కాగా బీటీ రోడ్డు వేయించిన పాలకులు పెద్దపల్లిలో బస్‌డిపో ఏర్పాటు చేయించి రవాణా సౌకర్యం మెరుగుపర్చాలని కోరుతున్నారు.

డిపో ఏర్పాటు చేయాలి



జిల్లాకేంద్రంలో రైలు సౌకర్యం ఉంది. ఇక్కడి నుంచి వివిధ రాష్ట్రాలకు ప్రయాణించేవారి కోసం అవసరమైన బస్సులు అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంత పల్లెలనుంచి పెద్దపల్లికి రావాలంటే ఆటోప్రయాణమే దిక్కు.

– చంద్రకళ, పెద్దకల్వల

ప్రభుత్వం స్పందించాలి



పెద్దపల్లిలో బస్‌డిపో ఏర్పాటును ఎప్పటి నుంచో కోరుతున్నా నెరవేర్చకపోవడం సరికాదు. పార్లమెంట్, అసెంబ్లీ, ఇప్పుడు జిల్లాకేంద్రంగా మారినా పాలకులు డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడం విచారకరం. ప్రభుత్వం స్పందించి బస్‌డిపో ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాస్, అప్పన్నపేట

24గంటల కరెంట్ ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌దే

- ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



మాట్లాడుతున్న పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పంటలసాగుకు 24 గంటల కరెంట్ ఇస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌దేనని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాఘవపూర్ రైతు వేదికలో రాఘవపూర్, అందుగులపల్లి, గౌరెడ్డిపేట,రంగాపూర్, దేవునిపల్లి, సబ్బితం గ్రామాల రైతులతో ఆదివారం ఏర్పాటు చేసిన రైతన్న సమావేశంలో మాట్లాడారు. రైతులను అరిగోస పెట్టే కుట్ర చేస్తున్న కాంగ్రెసోళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, నాయకులు కారె శ్రీనివాస్, రామస్వామి, సదయ్య, వెంకన్న బాబు, మహేందర్ పాల్గొన్నారు.

పలువురి చేరిక

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. జూలపల్లి మండలం వడ్కాపూర్‌కు చెందిన నాయకులు చేరగా.. ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. మాజీ ఎంపీటీసీ రాగుల నర్సింగం, హన్మమియా, సంపత్ గౌడ్, మొండయ్య, రాజయ్య, ఓదెలు, మొండయ్య ఉన్నారు.

జర్నలిస్టులక ఇళ్ల స్థలాలు కేటాయించాలి

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని జర్నలిస్టు సంఘ నాయకులు కోరారు. ఎమ్మెల్యే దాసరిని కలిసి వినతి పత్రం అందించారు.



కామారెడ్డి వద్దు.. పెద్దపల్లి ముద్దు

సీఎం కేసీఆర్ రానున్న ఎలక్షన్‌లో పెద్దపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని, అందుకు స్వాగతం అని భీమ్‌గర్జన ర్యాలీ పేరుతో పెద్దపల్లి కమాన్ చౌరస్తాలో స్థానికులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇది చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ పెద్దపల్లి, కామారెడ్డి నియోజకవర్గాల నుంచే పోటీ చేస్తారంటూ వారం రోజులుగా సోషల్‌మీడియాలో వైరల్‌గా మారుతోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సబ్బితం జలపాతానికి రావొద్దు



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గౌరీగుండాల జలపాతాన్ని తిలకించేందుకు సందర్శకులెవరూ రావొద్దని బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ సూచించారు. సందర్శకులను అడ్డుకున్నారు. భారీ వర్షాలతో జలపాతం వద్ద నీటి ఉధృతి పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున పర్యాటకులు ఆ ప్రాంతానికి వెళ్లొద్దని ఎస్సై సూచించారు. గతంలో జలపాతం వద్ద ప్రమాదాలు జరిగి అనేకమంది మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. జలపాతం ప్రాంతానికి వచ్చే యువత సహకరించాలన్నారు.

‘హలో’.. నాగరాజు.. నేను మున్సిపల్ కమిషనర్‌ను. మీ జువెల్లరీ షాపు ట్రేడ్‌లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోలేదు.. చివరి తేదీ దాటింది. ఫీజు కట్టకపోతే ట్రేడ్‌లైసెన్స్ క్యాన్సిల్ చేస్తాం..’ అంటూ గోదావరిఖనిలోని లక్ష్మినగర్‌కు చెందిన నాగరాజుకు ఓ అపరిచిత వ్యక్తి 9110763848 నంబర్ నుంచి కాల్ చేశాడు. దీనికి నాగరాజు కార్యాలయానికి వచ్చి చెల్లిస్తామని చెప్పగా ఓ నంబర్ చెప్పి ఫోన్‌పే చేయమన్నాడు. దీంతో నాగరాజు రూ.1,050 ఫోన్‌పే ద్వారా చెల్లించాడు.

ట్రేడ్ లైసెన్స్ పేరుతో టోకరా


గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన ఓ మహిళకు అదే నంబర్‌తో ఆదివారం ఫోన్ చేశాడు. ‘మీ బోటిక్ షాప్‌కు ట్రేడ్‌లైసెన్స్ రెన్యూవల్ చేయించలేదు. ఈ రోజు ఆదివారం అందుకే ఫోన్ చేస్తున్న.. వెంటనే నా నంబర్‌కు ఫోన్ చేయించి కట్టించాలని చెప్పి ఫోన్ కట్ చేశాడు. అనుమానం వచ్చిన ఆ మహిళ ఆరా తీయగా కమిషనర్ విధుల్లో లేరని తెలిసింది.

- మున్సిపల్ కమిషనర్‌నంటూ ఫోన్‌కాల్స్
- వ్యాపారుల నుంచి డబ్బులు వసూళ్లు
- ఆన్‌లైన్‌లో చెల్లించిన బాధితులు

కోల్‌సిటీ(రామగుండం): మున్సిపల్ కమిషనర్‌ను అంటూ వ్యాపారులకు టోకరా ఇస్తున్న వ్యక్తి 9110763848 నంబర్‌తో ఫోన్లు చేస్తున్నాడు. అనుమానంతో వ్యాపారులు ట్రూ కాలర్‌లో ఈ నంబర్‌ను పరిశీలిస్తే మున్సిపల్ కమిషనర్ ఖమ్మం, అసిస్టెంట్ కమిషనర్ (ఉమేష్ సూపర్‌వైజర్) అని చూపిస్తోందని అంటున్నారు. అపరిచితుడు పంపిన వాట్సాప్ నంబర్ 8309285419 ఎ.బాలగోపాల్ అని, ఫోన్ పే చేసిన నంబర్ 9711003390 నితీశ్ కుమార్ పేరు చూపిస్తోందని అంటున్నారు.

ఎవరీ అపరిచితుడు..?

వ్యాపారులను ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ పేరుతో టోకరా చేస్తున్న అపరిచితుడు ఎవరన్నది మిస్టరీగా మారింది. రెండు రోజులుగా వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్‌ను మాట్లాడుతున్నాను.. అంటూ ఫోన్ చేసి హడల్ పుట్టిస్తున్న వైనం, శనివారం సాయంత్రమే బల్దియా అధికారులకు తెలిసినా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. ట్రేడ్ లైసెన్స్‌లను జారీ చేస్తున్న ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శనివారం సాయంత్రం నుంచి అందుబాటులో లేరు. స్థానికంగా ఉండాల్సిన వారు వరంగల్‌కు వెళ్లారని సమాచారం.



అపరిచితుడి ఫోన్ నంబర్

ఫేక్ కాల్స్ నమ్మొద్దు

కార్పొరేషన్ నుంచి ట్రేడ్‌లైసెన్స్‌కు సంబంధించి వ్యాపారులకు కాల్ చేయడం లేదు. ఫేక్ కాల్స్ నమ్మొద్దు. డిఅండ్‌ఓ ట్రేడ్‌లైసెన్స్‌కు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఫోన్‌లో మాట్లాడితే లైసెన్స్ ఫీజు ఎవరూ చెల్లించవద్దు.

–మేయర్ అనిల్‌కుమార్

ఆరు నెలల క్రితం ఇదే తరహాలో మోసం

ఆరు నెలల క్రితం ఇదే తరహాలో మోసం జరిగింది. కార్పొరేషన్‌లో కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలు కల్పిస్తున్నామని, ఒక్కో డివిజన్ నుంచి అర్హులను ఎంపిక చేస్తున్నామని, వెంటనే ఆన్‌లైన్‌లో అప్లికేషన్లతోపాటు ఫీజు చెల్లించాలని గుర్తుతెలియని వ్యక్తులు కొందరు ప్రజాప్రతినిధులకు ఫోన్లు చేశారు. దీంతో వాస్తవాలు తెలుసుకోకుండా చాలామంది ఫోన్‌పేలో ఫీజులు చెల్లించి మోసపోయారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదులు రాకపోవడంతో పోలీసులు కూడా దర్యాప్తు చేపట్టలేదు.

అధికారం అండతో భూ కబ్జాలు



ఎలిగేడు: నర్సాపూర్‌లో జంటలను ఆశీర్వదిస్తున్న ప్రవీణ్‌కుమార్, లక్ష్మీబాయి దంపతులు

సుల్తానాబాద్‌రూరల్: అధికారాన్ని అడ్డుపెట్టుకుని బీఆర్‌ఎస్ నాయకులు భూకబ్జాలు చేస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో ఆదివారం బీఎస్పీ జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నియోజకవర్గంలో అరాచకాలు సృష్టిస్తున్నారని, రామునిపల్లిలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ట్రినిటి మెడికల్ కళాశాల నిర్మించేందుకు ప్రయత్నిస్తే.. సర్పంచ్ అడ్డుకోవడంతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మంత్రి అండతో ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారని తెలిపారు. అసైన్డ్ భూములను ఆక్రమించుకుంటున్నారని, కాంట్రాక్టులన్నీ తనవర్గాలకే దక్కేలా చేసి కమీషన్ వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తుల్లో 75శాతం అగ్రవర్ణాల వారే ఉంటున్నారని, బీసీలకు చోటులేదని తెలిపారు. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులపై ప్రధాని మౌనం సరికాదన్నారు. ఆయన వెంట పార్టీ డివిజన్ ఇన్‌చార్జి దాసరి ఉష, జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు వెంకటేష్, దుర్గయ్య, నాయకులు కల్వల రాజు, రియాజ్, తదితరులున్నారు.

బీఎస్పీతోనే పేదలకు న్యాయం

ఎలిగేడు: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరగడం లేదని, బీఎస్పీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా ఆదివారం ఎలిగేడు మండలం శివపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. బౌద్ధమత సంప్రదాయంలో వివాహం చేసుకున్న జంటలను ప్రవీణ్‌కుమార్ దంపతులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, జిల్లా అధ్యక్షుడు గొట్టె రాజు, అసెంబ్లీ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, కోశాధికారి ఎండీ.రియాజ్, ఉపాధ్యక్షుడు నార్ల గోపాల్, అనిల్, మండల అధ్యక్షుడు మారం సతీష్‌యాదవ్, కాంపెల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.



కూనారం చౌరస్తాలో..



రంగంపల్లి ప్రభుత్వ హాస్టల్ వద్ద

షాక్ కొడుతాయి జాగ్రత్త..!



కమాన్ వద్ద రాజీవ్ రహదారి పక్కన

అవసలే వర్షకాలం.. విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరిగే సమయం. ఏమాత్రం ఏమరుపాటుతో ఉన్నా షాక్ తగిలి ప్రాణాలు గాలిలో కలుస్తాయి. సమస్య ఇంత తీవ్రమైనప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు మాత్రం ముందు జాగ్రత్తలు తీసుకోవడం లేదు. జిల్లాకేంద్రంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు సేఫ్టీవాల్స్, కంచె ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌పార్మర్లు ప్రజలను భయపెడుతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



పోలీస్‌స్టేషన్ సమీపంలోని గాంధీ చౌరస్తాలో..

క్లుప్తంగా

మంథని, రామగిరి ఠాణాల తనిఖీ



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు

మంథని: మంథని, రామగిరి పోలీస్‌స్టేషన్లను గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాసరావు ఆదివారం మంథని సీఐ సతీశ్‌తో కలిసి తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలు, నేరాల వివరాలు తెలుసుకున్నారు. విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. ఠాణాకు వచ్చేవారితో మర్యాదగా నడుచుకోవాలని చెప్పారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, 100కు వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎస్సైలు మధుసూదన్, రవిప్రసాద్, దివ్య, రాణి వర్మ తదితరులున్నారు.

పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలి



ర్యాలీ తీస్తున్న స్థితప్రజ్ఞ, నాయకులు

పెద్దపల్లిరూరల్: పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్ర ఆదివారం పెద్దపల్లికి చేరింది. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. పట్టణ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఆగస్టు 12న హైదరాబాద్‌లో తలపెట్టిన ఆఖరి మోఖా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు శ్రీకాంత్, నరేశ్, లింగం శ్రీనివాస్, అజయ్, విజయ్‌కుమార్, సదాశివ్, సుధాకర్, రాజేందర్, విద్యాసాగర్ తదితరులున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



రఫీ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): ఒంటరితనం భరించలేక ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబల్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన మహమ్మద్ రఫీ(38) జమ్మికుంట పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో సమోసాలు విక్రయిస్తూ, కూలి పని చేసుకునేవాడు. ఈ క్రమంలో తాగుడుకు బానిసయ్యాడు. భార్య సాజియా బేగంతో గొడవలు జరగడంతో ఆమె ఇద్దరు పిల్లలను తీసుకొని, మంచిర్యాల్‌లోని తల్లిగారింటికి వెళ్లిపోయింది. ఒంటరితనంతో మనస్తాపానికి గురైన రఫీ ఆదివారం రైలు కింద పడి, ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు మహమూద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి బలవన్మరణం



రమేశ్ మృతదేహం

శంకరపట్నం(మానకొండూర్): మండలం మెట్‌పల్లి గ్రామంలో ముంజ రమేశ్(26) ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మెట్‌పల్లికి చెందిన ముంజ కనకయ్యకు భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కొడుకు రమేశ్ పీజీ వరకు చదువుకున్నాడు. తన ఉద్యోగం రావడం లేదని నిత్యం మనోవేదనకు గురవుతున్నాడు. కొంతకాలంగా మ నోవ్యాధితో బాధ పడుతున్నాడు. కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులు చేసేందుకు ఆదివా రం పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి, ఉరేసుకున్నాడు. కాసేపటికి పశువులకు పచ్చిగడ్డి కోసుకొని, ఇంటికి వచ్చిన తండ్రి ఉరేసుకున్న కుమారుడిని చూసి, చుట్టుపక్కల వారిని పిలిచాడు. కొన ఊపిరితో ఉన్న అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ఇల్లంతకుంట(మానకొండూర్):కందికట్కూర్‌కు చెందిన దేవరకొండ నరేశ్(39) గ్రామ సమీపంలోని మానేరువాగులో చేపలు పట్టేందుకు వెళ్లి, ఈత రాకపోవడంతో మృతి చెందాడు. శనివారం మధ్యాహ్నం నరేశ్ చేపలు పట్టేందుకు వెళ్లి నీటిలో పడిపోగా మృతదేహం ఆదివారం మధ్యాహ్నం తేలిందని గ్రామస్తులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాజేశ్ ఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య ఝాన్సీ, కుమారుడు ఉన్నారు.







జలపాతం వద్ద బీర్లు, మద్యం బాటిళ్లతో యువకులు





'సబ్బితం'.. ఆకతాయిలతో అసౌకర్యం

పక్షుల కిలకిలారావాలు.. చుట్టూ పచ్చదనం మధ్య పెద్దపల్లి జిల్లా కేంద్రానికి సమీపంలోని సబ్బితం గౌరీగుండాల జలపాతం పర్యాటకులకు ఆహ్లాదం పంచుతోంది. గుట్ట పైనుంచి కిందికి దూకుతూ మంత్రముగ్ధుల్ని చేస్తోంది. ఆదివారం సెలవు దినం కావడంతో ఈ జలపాతం జనంతో కిక్కిరిసిపోయింది. కుటుంబ సమేతంగా వచ్చి సెల్ఫీలు దిగుతూ నీటిలో ఆటలాడుతూ సందడి చేశారు. జలపాతం వద్దకు వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు నడవాలి. వాహనాలు వెళ్లేందుకు దారి సరిగా లేదు. అయినా కష్టపడి, నడుచుకుంటూ కుటుంబ సమేతంగా వెళ్లేవారు అక్కడ ఆకతాయిలతో అసౌకర్యానికి గురవుతున్నారు. కొందరు నీటిలోనే మద్యం సేవిస్తున్నారు. ఈలలు వేస్తూ.. జంప్ చేస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సాగునీటి సంఘాలకు ఎన్నికలేవి?

- 1997లో తొలిసారి నిర్వహణ
- 2010లో ఏర్పాట్లు
- తర్వాత రెండేళ్లు పాతవాటినే పొడిగిస్తూ ఉత్తర్వులు
- అప్పటినుంచి ఊసే ఎత్తడం లేదు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 180 సంఘాలు



ఎస్సారెస్పీ డీ–86 కాల్వ

పెద్దపల్లిరూరల్: సాగునీటి వినియోగదారుల సంఘాలకు 13 ఏళ్లు ఎన్నికలు నిర్వహించడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడే ఏర్పాటు చేసిన ఈ సంఘాల పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆదర్శ రైతుల వ్యవస్థను రద్దు చేసి, రైతుబంధు సమితులను ఏర్పాటు చేశారు. శ్రీరాంసాగర్, కాకతీయ కాల్వలతో పాటు కొత్తగా ప్రాజెక్టుల నిర్మాణం, పునరుద్ధరణ పనులు చేపట్టిన ప్రభుత్వం నీటి వినియోగంపై పర్యవేక్షణ కోసం సాగునీటి సంఘాల పునరుద్ధరణ చేపడితే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

100 ఎకరాల ఆయకట్టుకు ఓ సంఘం

సాగునీటి వినియోగదారుల సంఘం ఏర్పాటుకు కనీసం 100 ఎకరాల ఆయకట్టు ఉండాలనే ప్రాతిపదిక అమలు చేశారు. ఆ కాల్వ ఆయకట్టు పరిధిలో ఉండి, 18 ఏళ్లు పైబడినవారికే ఓటరుగా పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఆయా సంఘాల పరిధిలోని ఓటర్లు తమ సంఘ ప్రాదేశిక సభ్యుడిని, ప్రాదేశిక సభ్యులంతా చైర్మన్‌ను ఎన్నుకునేవారు. రెండేళ్లకు 1/3 వంతు సభ్యులు పదవీ విరమణ చేసేలా మార్గదర్శకాలు రూపొందించారు.

ఒక్కో సంఘంలో 12 మంది సభ్యులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 180 సాగునీటి వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సంఘంలో 12 మంది ప్రాదేశిక సభ్యులున్నారు. ఇలా 10 సాగునీటి సంఘాల చైర్మన్లు, ఓ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. 18 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు ఓ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌ను ఎన్నుకున్నారు. 1997లో తొలిసారి సంఘం ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత 2003లో రెండోసారి నిర్వహించారు. రొటేషన్ పద్ధతిన 2010లో నిర్వహించేందుకు అప్పటి అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేసింది. అనూహ్యంగా ప్రభుత్వం పాత కమిటీలనే మరో ఏడాది (2011 జనవరి) పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత మరో ఏడాది (2012 జనవరి31)కి పెంచుతూ ఆదేశాలిచ్చింది. అనంతరం ఆ ఊసే ఎత్తడం లేదు. బీఆర్ఎస్ పార్టీ వ్యవసాయ రంగంపైనే ప్రధానంగా ఫోకస్ పెట్టిన నేపథ్యంలో అందులో భాగమైన సాగునీటి వినియోగదారులతో సంఘాలను ఏర్పాటు చేస్తే నీటి వినియోగంపై పర్యవేక్షించే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

పునరుద్ధరిస్తేనే మేలు



సాగు నీటిని కాల్వ చివరి భూములకు అందించేందుకు వీలుగా సాగునీటి వినియోగదారుల సంఘాలను పునరుద్ధరిస్తేనే మేలు. గతంలో ఉన్న సంఘాలతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరింది.

– ఎం.నర్సింహారెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్, పెద్దపల్లి

ప్రభుత్వం నుంచి ఆదేశాల్లేవు

సాగునీటి సంఘాలకు 13 ఏళ్లుగా ఎన్నికలు లేవు. అంతకుముందు రెండేళ్లకోసారి పదవీ విరమణ చేసేలా సభ్యులు చైర్మన్లను ఎన్నుకునేవారు. కానీ వాటికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాల్లేవు.

– శ్రీనివాస్, ఎస్సారెస్పీ ఈఈ, పెద్దపల్లి

వరినారుతో మంత్రి కేటీఆర్‌కు బర్త్‌డే విషెస్



రామగుండం: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్‌కు ఆదివారం పాలకుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు కందుల సంధ్యారాణి వినూత్న రీతిలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన స్వగ్రామమైన లింగాపూర్‌లో ఇండ్ల నరేశ్, స్వప్న పొలంలో వరినారుతో హ్యాపీ బర్త్ డే కేటీఆర్ అంటూ విషెస్ చెప్పి, కూలీలకు మిఠాయిలు పంచిపెట్టారు.

పత్తి పంటకు జీవం



సుల్తానాబాద్‌లో సాగువుతున్న పత్తి పంట

పంట	సాగైంది (ఎకరాల్లో)
వరి	42,250
పత్తి	57,451
మొక్కజొన్న	460
వాణిజ్య పంటలు	2,460

సుల్తానాబాద్: జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు పంటలకు పత్తి పంటకు జీవం పోసినట్లయ్యింది. వానాకాలం ప్రారంభం నుంచే వ ర్షం కురవలేదు. అప్పుడప్పుడు కురిసిన చిరుజల్లులకు రైతులు కొన్నిచోట్ల విత్తనాలు వేసుకున్నారు. అనంతరం వర్షం ముఖం చాటేయడంతో ఆందోళనకు గురయ్యారు. కొన్ని ప్రాంతాల్లో మరోసారి విత్తుకోవాల్సి వచ్చింది. ఈ తరుణంలో కురుస్తున్న వర్షం రైతులకు ఊరట కలిగించింది. జిల్లాలో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 334.8 మిల్లీమీటర్లు కాగా ఇప్పటివరకు 301.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం జిల్లా సాధారణ వర్షపాతం 9.8 మిల్లీమీటర్లు కాగా 30.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కురుస్తున్నవి చిరుజల్లులే అయినా.. ఎడతెరిపి లేకుండా పడుతుండడంతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు రైతులు పొలంబాట పట్టారు. ముసురు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మహిళా కూలీలు, రైతులు, ట్రాక్టర్ యజమానులు పొలం పనులు బిజీగా ఉన్నారు.

పంటలకు ఊతం..

ఏటా వర్షాకాలంలో జిల్లాలో పత్తిసాగు అధికంగా సాగవుతుంది. మొదటగా కురిసిన వర్షానికే రైతులు పత్తి విత్తుకున్నారు. కొన్ని మొలకెత్తినా.. పంట ఆశించిన స్థాయిలో ఎదకకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


జలాశయాల్లోకి నీరు

వర్షాలతో జలాశయాల్లోకి నీరు చేరుతోంది. లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి నీరు చేరుతోంది. మొన్నటివరకు సాధారణ నీటి మట్టంతో వెలవెలబోయిన ప్రాజెక్టులు తాజాగా జలకళ సంతరించుకున్నాయి. జిల్లాలో ఇప్పటికే 30 శాతం వరి సాగు పూర్తయింది.

జాగ్రత్తలు తప్పనిసరి


వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలను పట్టుకోవద్దని విద్యుత్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇంటి గోడలకు షాక్ తగిలే అవకాశముందని, అటువైపు వెళ్లవద్దని సూచిస్తున్నారు. మరోవైపు చేపలవేటకు వెళ్లేవారు జలాశయాలతోపాటు మానేరు, ఇతర వాగుల వద్దకు వెళ్లవద్దని కోరుతున్నారు.

రైతులకు ఉపయోగం



మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులకు మేలు జరుగుతుంది. పత్తి పంటకు జీవం పోసినట్టు అయింది. వరి సాగు వేగవంతమైంది. వర్షం ఇలాగే కురిస్తే జలాశయాల్లోకి నీరు చేరుతుంది. సాగు విస్తీర్ణం పెరుగుతుంది. – ఆదిరెడ్డి, డీఏవో

బిజీ అయ్యాం



వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. మొన్నటివరకు వర్షం లేక ఆందోళనకు గురయ్యాం. ఇప్పుడు పొలం పనుల్లో అందరం బిజీగా ఉన్నాం. కూలీలు, మహిళలకు నాట్లతో ఉపాధి దొరుకుతోంది. – శీలం శంకర్, రైతు, గట్టేపల్లి

వర్షానికి కూలిన గోడలు



కూలిపోయిన ఇంటి గోడ

యైటింక్లయిన్‌కాలనీ: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా సింగరేణి ప్రభావిత గ్రామమైన వెంకట్రావుపల్లి కేకేనగర్‌లో ఇళ్ల గోడలు కూలిపోతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి గ్రామంలోని కొలుగూరి రాజేశం ఇంటి గోడ, ఎండీ.మానుక్ రబ్బాని ఇంటి ప్రహరీ కూలిపోయాయి. ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 బ్లాస్టింగ్‌లతో ఇళ్లకు పగుళ్లు ఏర్పడి, వర్షాలు పడినప్పుడు తడిసి, కూలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఇలాగే జరుగుతోందని, భయంభయంగా బతుకుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి, కేకేనగర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు. గోడలు కూలిపోయిన వారికి ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం పరిహారం చెల్లించాలని మాజీ సర్పంచ్ బుర్ర ముత్యాలు గౌడ్ కోరారు.

డైట్ చార్జీలు పెంచడం హర్షణీయం

కరీంనగర్: సంక్షేమ హాస్టల్స్‌లో డైట్ చార్జీలు పెంచడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఉద్యమ పోరాటాల ఫలితం వల్లే సీఎం కేసీఆర్ విద్యార్థుల డైట్ చార్జీలను పెంచడం జరిగిందన్నారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కొన్నేళ్లుగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం ఇప్పటికి స్పందించిందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నర్సింగోజు శ్రీనివాస్, నల్లగొని శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్, అనుమాస నితిన్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

జీడీకే–5 ఓసీపీ సందర్శన



మాట్లాడుతున్న డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–5 ఓసీపీని డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. వ్యూపాయింట్ వద్ద మ్యాప్‌ను, పని స్థలాలను పరిశీలించి, భవిష్యత్తులో చేపట్టాల్సిన ప్రణాళికలపై సూచనలు చేశారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణాకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోల్ బెంచ్‌లు, ఫైర్ ఫైటింగ్ విధానంపై చర్చించారు. తప్పనిసరిగా రక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఇంజినీర్ ఎస్‌వీ రావు, మేనేజర్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

జీడీకే–1 గని ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీగా శ్రీనివాస్

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా జీడీకే–1 గని ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీగా మానాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో గని నూతన కమిటీ ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా ఉప్పులేటి తిరుపతి, కలవేణి రాజేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గన్నెర్ల చంద్రయ్య, గుండు శంకర్, ఈరగొండ మల్లేశ్, సిర్ర మల్లికార్జున్, పొట్ట రమేశ్‌తోపాటు 50 మంది డెలిగేట్స్‌గా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

11వ వేతన ఒప్పంద అంశాలపై పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న రాజారెడ్డి, నాయకులు

గోదావరిఖని: బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పంద అంశాలపై ముద్రించిన పుస్తకాన్ని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి గోదావరిఖనిలోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. సింగరేణి కార్మికులకు అర్థమయ్యేలా పుస్తకానికి రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, కొమురయ్య, ఆసరి మహేశ్, జి.సాయికృష్ణ, శశి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

37 ఏళ్లకు.. ఒక్కచోటకు



ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు

మంథని: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1986–87 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి మంథని ఫ్రెండ్స్ క్లబ్ వేదికైంది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారు 37 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి, తమ చిన్ననాటి మిత్రులను చూసి, భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, కుటుంబ క్షేమసమచారం తెలుసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు మోహన్‌శర్మ అవధానిని సన్మానించారు. తర్వాత అందరూ కలిసి భోజనం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి సందడిగా గడిపారు. మంథని, గల్ఫ్, మహారాష్ట్ర, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 50 మంది వరకు హాజరయ్యారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- వృద్ధుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన రాజలింగం

సుల్తానాబాద్ రూరల్: ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. సుల్తానాబాద్‌కు చెందిన రాజలింగం ఆదివారం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. మున్సిపల్ పరిధిలోని స్వప్నకాలనీ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు. కాగా, రాజలింగం పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పారని తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజేందర్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 21న ఆత్మహత్యాయత్నం



అశోక్‌కుమార్ మృతదేహం

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండ్లపల్లెకు చెందిన ముక్కీస అశోక్‌కుమార్(35) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఏఎస్సై ఫయిజ్ కథనం ప్రకారం.. అశోక్‌కుమార్ ప్రైవేటుగా పశువులకు వైద్యం చేసేవాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై, ఆర్థికంగా ఇబ్బంది పడుతూ ఇంట్లో కుటుంబసభ్యులతో గొడవపడేవాడు. ఈ నెల 21న తాను కనుకుల గుట్ట వద్ద క్రిమిసంహారక మందు తాగానని భార్యకు ఫోన్‌లో చెప్పి, పడిపోయాడు. వెంటనే అతని భార్య శ్రీమతి, తల్లి సంఘటన స్థలానికి వెళ్లి, అశోక్‌కుమార్‌ను సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి ఒక బాబు ఉన్నాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.